నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఖమ్మం - వరంగల్ - నల్గొండ
మంగళవారం, 18 ఆగష్టు 2026



అభివృద్ధి పథంలో ప్రగతి బాటలు..

## పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం!

- పట్వారిగూడెంలో పంచాయతీ భవన పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే..
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట ఘనంగా జరిగిన భూమి పూజ..
- నిరంతరం శ్రమ... నియోజకవర్గ ప్రగతి..!

**దమ్మపేట, ఆగష్టు 17(నినాదం):**
నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పట్వారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ నిర్వహించి ఘనంగా శంకుస్థాపన చేశారు.

**ప్రజల చెంతకే పాలనా సేవలు..!**

ఈ సందర్భంగా ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన మిగతా 6లో...

## మనిషి బతికుండగానే 'లేట్'..

- తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో వింత తప్పిదం
- మంత్రి ఆదేశించినా పరిష్కారం కాని ఇందిరమ్మ ఇంటి బిల్లు
- రికార్డుల్లో భర్తను 'మరణించిన వ్యక్తి'గా నమోదు చేశారంటూ మాజీ సర్పంచ్ ఆవేదన

7



## శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు

- ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిరక్షణకు జేఏసీ ఏర్పాటు
- అన్ని వర్గాల సిబ్బంది ఐక్యంగా ముందుకు సాగాలి: ప్రిన్సిపాల్ కరుణ్ కుమార్

6




# నాడు మంత్రి ఇచ్చారు.. నేడు కబ్జాదారులు నొక్కేశారు..

## మూడు దశాబ్దాల నిరీక్షణ.. ముప్పై ఏళ్లుగా వీడని భూ చిక్కు...!

అధికార ముద్రతో ప్రభుత్వం ఇచ్చిన భూమికే రక్షణ కరువైంది. నాటి పాలకులు ఆదరించి ఆసరాగా నిలిచినా, నేటి క్షేత్రస్థాయి పరిస్థితులు ఒక నిరుపేద కుటుంబానికి కన్నీళ్లను మిగులుస్తున్నాయి. కులాంతర వివాహం చేసుకున్నందుకు గాను నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అందిన ఐదు ఎకరాల భూమి, మూడు దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో చేతికి రాకపోవడం గమనార్హం. ఒక ఎకరం భూమి ఇతరుల ఆక్రమణకు గురికావడంతో.. తన భూమిని తనకు దక్కించాలంటూ పూనెం పోలమ్మ అనే మహిళ దమ్మపేట తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' వేదికగా అధికారులకు మొరపెట్టుకున్నారు.

**దమ్మపేట ఆగష్టు 17(నినాదం):**

- ప్రభుత్వం ఇచ్చిన భూమికే రక్షణ కరువు..
- ప్రజావాణిలో పూనెం పోలమ్మ ఆర్తనాదం...
- మంత్రి తుమ్మల ఇచ్చిన ఐదెకరాల్లో ఒక ఎకరం కబ్జా..!
- సర్వే చేసి భూమి అప్పగించాలని పూనెం పోలమ్మ ఆవేదన...



**నాడు మంత్రి ఆదరణ.. ఐదెకరాల పట్టా!**

బాధితురాలి కథనం ప్రకారం.. గత ముప్పై ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్న పూనెం పోలమ్మ కుటుంబ పరిస్థితిని గమనించిన నాటి ప్రభుత్వం వారిని ఆదుకుంది. 1996వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో శక్తివంతమైన మంత్రిగా కొనసాగిన తుమ్మల నాగేశ్వరరావు మిగతా 7లో...

మాతాశిశు హాస్పిటల్ సౌకర్యాల

## కల్పనలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

- డాక్టర్లు లేక గర్భిణి స్త్రీలకు అందని వైద్యం
- స్కానింగ్ కొరకు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లే దిక్కు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్
- సిపిఎం సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి



8



మెయిన్ హాస్పిటల్ వద్ద అరుదైన

## ఇండియన్ ప్యాంగోలిన్ రక్షణ

**కిన్నెరసాని ప్రాంతంలో సురక్షిత పునరావాసం**

**లక్ష్మీదేవిపల్లి, ఆగష్టు 17 (నినాదం):**
కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్ పరిసర ప్రాంతంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అరుదైన వన్యప్రాణి ఇండియన్ ప్యాంగోలిన్ (మనీష్ క్రాస్సికౌడేటా) ను గుర్తించి సురక్షితంగా రక్షించిన సంఘటన చోటుచేసుకుంది. రాత్రి విధుల్లో భాగంగా గస్తీ నిర్వహిస్తున్న కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ కానిస్టేబుల్ రాజు, మిగతా 8లో...

# తులం బంగారం 'టోకరా'.. కళ్యాణలక్ష్మిపై కుట్ర!

- ఆడబిడ్డల పెళ్లిళ్లకు కాంగ్రెస్ 'గ్రహణం'..!
- 'మేనమామ' కేసీఆర్ ఆసరాను లాగేసుకుంటారా...
- కాంగ్రెస్ తీరుపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నిప్పులు...
- దోచుకోవడమే కాంగ్రెస్ పని... మెచ్చా తీవ్ర ఆరోపణ..
- దమ్మపేట తహశీల్దార్ ఆఫీస్ ఎదుట బీఆర్ఎస్ భారీ నిరసన..



**దమ్మపేట, ఆగస్టు 17(నినాదం):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచిన 'కళ్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను నిలిపివేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన భారీ నిరసన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమొరాండంను డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. "ముఖ్యమంత్రి నుంచి క్షేత్రస్థాయి ఎమ్మెల్యేల వరకు ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. స్వరాష్ట్రంలో ఆడబిడ్డలు పెళ్లిళ్ల కోసం అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ ఒక మేనమామలా ఆలోచించి ఈ పథకాలను తెచ్చారని, వేలాది కుటుంబాలకు ఆర్థిక కొండంత అండగా నిలిచారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆడిన నాటకాలను మెచ్చా ఈ సందర్భంగా ఎండగట్టారు. "కేసీఆర్ లక్ష రూపాయలు ఇస్తే.. తాము అధికారంలోకి రాగానే ఆ లక్షతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ఆడబిడ్డలను కాంగ్రెస్ నమ్మబలికింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయక పోగా, ఉన్న పథకాన్ని కూడా ప్రశ్నార్థకంగా మార్చేసింది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తులం బంగారం ఇవ్వడం భారంగా మారి, ఆ నెపం నుంచి తప్పించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారీ కుట్రలు చేస్తూ పథకాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిపై క్షేత్రస్థాయిలో తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోందని, గ్రామాల్లోకి వస్తున్న కాంగ్రెస్ నాయకులను ఆడబిడ్డలు నిలదీస్తుంటే, ఏం సమాధానం చెప్పాలో తెలియక వారు ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తూ.. పెండింగ్‌లో ఉన్న 'కళ్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలన్నారు. అలాగే హైకోర్టు కేసును సాకుగా చూపకుండా, దీనిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆడబిడ్డలకు ఆశచూపిన తులం బంగారం హామీని ఎప్పటి నుంచి, ఏ విధంగా అమలు చేయబోతుందో అధికారికంగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పేదల పొట్టగొట్టేలా కాంగ్రెస్ వ్యవహరిస్తే బీఆర్ఎస్ ఊరుకోదని, లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు, నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు, మండల నాయకులు తుమ్మల లక్ష్మనరావు, మాజీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు దేవరలపల్లి అజయ్ కుమార్, సీనియర్ నాయకులు జలగం వాసు, చీకటి రామయ్య, అబ్దుల్ జిన్నా, సర్పంచ్ లు యాట్ల రాందాస్, కొమరం సుశీల, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డ్ మెంబర్లు దారా రాము, రూప రాంబాబు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, మద్దెల పుల్లారావు, అడపా వెంకట నరసయ్య నాయుడు, పాశం ప్రసాద్, వల్లేపు నాగేశ్వరరావు, కందు కూరి రాంబాబు, మచ్చల ముత్యాలు, తదితరులు ఉన్నారు.

# రైతులకు శాపంగా మారిన కాంగ్రెస్

- ప్రజా పాలనలో పేదలకు తీరని అన్యాయం
- రైతు బీమా, కళ్యాణ లక్ష్మి పథకాలకు రాం రాం
- మాజీ మంత్రి రెడ్యానాయక్



**డోర్నకల్ /మరిపెడ ఆగష్టు 17(నినాదం)**
తెలంగాణలో రైతు బీమా పథకానికి సంబంధించి ఎల్ఐసి ప్రీమియం చెల్లించాల్సిన గడువు ఆగష్టు 14 తో ముగిసినప్పటికీ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వారికి ప్రీమియం చెల్లించలేదు. దీనితో ఐదు లక్షల ప్రమాద బీమా నిలిచిపోతుందని ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతుంది. రైతు భీమా పథకంతో రైతులకు ఎంతో భరోసాగా నిలిచిన ఈ పథకాన్ని ప్రీమియం చెల్లించకుండా రైతులకు ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి రెడ్యానాయక్ అధ్యక్షతన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు సమక్షంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి ప్రభుత్వ అతిథి గృహం ముందు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున రోడ్లపై కూర్చుని ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతు బీమా, రైతు బంధు, సాగునీరు అందజేసి రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు భరోసాగా నిలిచారన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి జరిగితే ఇంటికి మేనమామ అయి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష 16 రూపాయల చెక్కును అందజేసి పేదలకు ధైర్యాన్ని కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. నెరవేరని 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు వరంగా ఉన్న రైతు బీమా, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వంలో అమలు ఉన్న పథకాలను పున:ప్రారంభించి పేదలకు అందే విధంగా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ రావు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు గాని హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే కొత్త పథకాలు ఇవ్వడం దేవుడెరుగు గానీ రైతు ఏ కారణం చేతనైన చనిపోతే వారి కుటుంబం రోడ్డున పడకుండా ఉండడానికి రైతు బీమా పథకాన్ని ప్రీమియం చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేసిందన్నారు. పేదలకు వరంగా ఉన్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలకు పంగనామం పెట్టేసారన్నారు. ఇప్పటికైనా దిగివచ్చి రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ యువ నాయకులు డి ఎస్ రవిచంద్ర మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల జీవితాన్ని నాశనం చేస్తుందని బీఆర్ఎస్ యువ నాయకులు డీఎస్ రవిచంద్ర అన్నారు. తెలంగాణ రైతులకు 24 గంటల సాగునీరు ఇచ్చే విధంగా నిర్మించి ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుండి మోటార్ల ద్వారా ఎత్తిపోసి రైతులకు నీరు అందించకుండా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతులకు వరంగా ఉన్న రైతు బీమా, పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను నిలిపివేయడం పేదలకు గొంతు కోసినట్టే అన్నారు. 420 హామీలను ఇచ్చి అధికారంలోకి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, కొత్త హామీలను ఏవి అమలు చేయకుండా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సూచికగా, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను నిలిపివేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజా పాలన పేరుతో పేదల పథకాలను నిలిపివేసి వారికి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా తొలి తాగతిన పథకాలను పున:ప్రారంభించాలన్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్పంచ్ లు, వార్డ్ కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు ఇంకా తదితరులు పాల్గొన్నారు..

**ప్రజావాణిలో ఫిర్యాదు..**

రైతు బీమా, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ పథకాలను ఎప్పటిలాగే కొనసాగించాలని మరిపెడ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మార్వో కృష్ణవేణి లకు ఫిర్యాదును అందజేశారు. గత ప్రభుత్వంలో పేదలకు అందజేసిన పథకాన్ని యధా విధంగా కొనసాగేలా చూడాలని కోరారు...



## పేద కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17(నినాదం):**
కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ..బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మేచ్చా నాగేశ్వరరావు పిలుపు మేరకు అన్నపురెడ్డిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్ రావు ఆధ్వర్యంలో సోమవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్న రైతు వేదిక ఎదుట నిరసన వ్యక్తం చేసి డిమాండ్ చేశారు. అనంతరం రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఉన్న స్థానిక తహసీల్దార్ స్వర్ణ కు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిరుపేద కుటుంబాలకు అండగా కెసిఆర్ ప్రభుత్వంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించి నీరు పేదలకు తీరని అన్యాయం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొత్తూరు వెంకటేశ్వరరావు, ఐలూరు కృష్ణారెడ్డి, పర్స మాధవ రావు, పెద్దగౌండ్ల పుల్లారావు, చల్లా రాంబాబు, ఇటుకల సత్యం, చల్లా రమేష్, ఇనపనూరు రాంబాబు, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, వాడే రాంబాబు, పానుగంటి రాఘవులు, ఇటుకల హరీ, యాదల జములయ్య, బానోతు వెంకన్న, చల్లా ప్రసాద్, తేజావత్ శివ, శ్రీను బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## సీతారామ జలాలను వారబందీగా విడుదల చేయాలి

- 20 వేల ఎకరాల పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి
- మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దీవెల కృష్ణయ్య

తల్లాడ, ఆగస్టు 17 (నినాదం)
సీతారామ ప్రాజెక్టు నుంచి ఏన్కూరు ఎన్ఎస్పీ లాక్‌ల ద్వారా స్థానిక రైతుల పంట పొలాలకు వారబందీ పద్ధతిలో సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, బిల్లుపాడు గ్రామ రైతు దీవెల కృష్ణయ్య కోరారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఎన్ఎస్పీ అధికారులకు గ్రీవెన్స్ ద్వారా వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీధర్ రాజుకు అందజేశారు. ఏన్కూరు నుంచి గోపాలపేట, అన్నారుగూడెం, బిల్లుపాడు, వెంగన్నపేట, అంజనాపురం, తెలగవరం తదితర గ్రామాల రైతులు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా సాగునీటిని వినియోగించు కుంటూ ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని కృష్ణయ్య తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో సీతారామ ప్రాజెక్టు నీరు ఈ ప్రాంత పంట పొలాలకు చేరడంతో రైతుల్లో భరోసా ఏర్పడిందన్నారు. అయితే ప్రస్తుతం ఏన్కూరు ఎన్ఎస్పీ లాక్‌ల నుంచి సీతారామ ప్రాజెక్టు నీటిని కల్లూరు, పెనుబల్లి మండలాల వైపు మళ్లిస్తుండటంతో స్థానిక రైతుల పంటలకు సాగునీటి కొరత ఏర్పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 20 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగులో ఉన్నాయని, తగినంత వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.

**పంటలు ఎండిపోకుండా వారబందీగా నీరు ఇవ్వాలి**

రైతుల పంటలను కాపాడేందుకు సెప్టెంబర్‌లో రెండుసార్లు, అక్టోబర్‌లో రెండుసార్లు వారబందీ పద్ధతిలో సీతారామ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంటలకు కీలకమైన సమయంలో నీరు అందిస్తే వేలాది మంది రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమయి ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్ఎస్పీ, సీతారామ ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసి స్థానిక రైతుల పంటలకు ప్రాధాన్యతనిస్తూ సాగునీటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. 20 వేల ఎకరాల పంటలను కాపాడేందుకు వారబందీగా నీటిని అందించడం రైతులకు ఎంతో ఊరటనిస్తుందని దీవెల కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరరెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ జలాలు విడుదల చేయాలి

- అన్నారుగూడెం పేదలకు పక్కా ఇళ్లు.. ఇవ్వాలి
- వ్యవసాయ అధికారి ఏఈఓను నియమించాలి
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి భాజపా కిసాన్ మోర్చా జిల్లా నాయకులు ఆపద వెంకట రామారావు




**తల్లాడ, ఆగస్టు 17 (నినాదం)**

రైతులు, పేదలు, ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భాజపా కిసాన్ మోర్చా జిల్లా నాయకులు ఆపద వెంకట రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రైతులు, బాధితులతో కలిసి వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అన్నారుగూడెం గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు వెంటనే పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే అన్నారుగూడెం క్లస్టర్‌కు శాశ్వతంగా ఏఈఓను నియమించాలని డిమాండ్ చేశారు. ఏఈఓ లేకపోవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, పంట సమస్యలపై సరైన మార్గదర్శకత్వం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**పంటలు ఎండిపోతున్నాయి.. సీతారామ నీరు ఇవ్వాలి**

సిరిపురం మేజర్ కాలువకు సీతారామ ప్రాజెక్టు ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని వెంకట రామారావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల కష్టార్జితాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టును సిరిపురం మేజర్‌కు అనుసంధానం చేసే క్రమంలో కాలువను వెడల్పు చేయడం వల్ల పలువురు రైతుల పంట పొలాలు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. రైతుల భూముల్లో కాలువ పనులు చేపట్టే ముందు వారి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, అలా చేయకపోవడం సరికాదన్నారు. కాలువ విస్తరణలో భూములు, పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**ఎస్సీ కాలనీకి పునరావాసం కల్పించాలి**

కాలువ గ్రామం మధ్య నుంచి వెళ్లడం వల్ల ఎస్సీ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని వెంకట రామారావు తెలిపారు. కాలువ నిర్మాణం కారణంగా నష్టపోయిన, ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులకు పక్కా ఇళ్లు మంజూరు చేసి పునరావాసం కల్పించాలని కోరారు.రైతులు, పేదలు, ఎస్సీ కాలనీ ప్రజల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే భాజపా ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆపద వెంకట రామారావు హెచ్చరించారు. హామీలతో కాకుండా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బాధితులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచండి

**హైదర్ సాయిపేట--సిరోలు మధ్య రహదారి నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు**




**తిరుమలాయపాలెం,ఆగస్టు 17 (నినాదం)**

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి కాస్త సమస్యల వానిగా మారింది. ప్రజావాణి ప్రజలు వివిధ రకాల సమస్యలతో ప్రజావాణిలో అధికారులకు అర్జీలు దాఖలు చేసినారు అందులో ప్రధానంగా ఆకేరు నది పై బ్రిడ్జి నిర్మించి హైదర్ సాయిపేట నుంచి సిరోలు వరకు రహదారి సౌకర్యం కల్పించాలని ఖమ్మం జిల్లా జేఏసీ అధ్యక్షులు మందడి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఆకేరు పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న రైతులు, గ్రామీణ ప్రజలు రాకపోకలకు సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, పంటలను మార్కెట్లకు తరలించే సమయంలో అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

**బ్రిడ్జి నిర్మాణం జరిగితే మూడు జిల్లాలకు ప్రయోజనం..**

హైదర్ సాయిపేట--సిరోలు మధ్య ఆకేరుపై బ్రిడ్జి నిర్మించి రహదారి ఏర్పాటు చేస్తే ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల మధ్య దూరం తగ్గడంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవలు పొందే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఒక బ్రిడ్జి నిర్మాణంగా కాకుండా మూడు జిల్లాలను అనుసంధానించే కీలక రవాణా మార్గంగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వం పరిగణించాలని కోరారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి**

ఖమ్మం జిల్లా ప్రజల సమస్యలపై స్పందించే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, బ్రిడ్జి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఆకేరుపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, హైదర్ సాయిపేట నుంచి సిరోలు వరకు రహదారి నిర్మాణాన్ని చేపడితే ఈ ప్రాంత ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. ఇది ఒక గ్రామానికి సంబంధించిన సమస్య కాదు, ఈ సమస్య మూడు జిల్లాల ప్రజల రవాణా భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆకేరుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలి అని ఆయన కోరారు.

# కోర్టు ఆదేశాలతో గిరిజన మహిళకు న్యాయం

- కోర్టు ఆదేశాలతో మహిళలకు 3 ఎకరాల భూమి అప్పగింత
- తహసిల్దార్, సిఐ ఆధ్వర్యంలో భూమి హద్దులు పాతి మహిళకు అప్పగింత



**ఇల్లందు, అగస్ట్ 17 ( నినాదం):**

ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదానికి కోర్టు ఆదేశాలతో తెరపడింది. సింగరేణి మండలం ఉలివికాయలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 548/37 /5/4లోని 3 ఎకరాల భూమిని గిరిజన మహిళ బానోతు లక్ష్మికి రెవెన్యూ, పోలీస్, సర్వే శాఖల అధికారులు సమక్షంలో అప్పగించారు. కోర్టు ఆదేశాల మేరకు తహసిల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనంతరం బాధితురాలికి భూమి స్వాధీనం అప్పగించడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది.

**పోలీసుల భారీ బందోబస్తు**

భూమి విషయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు సమస్యను శాంతియుతంగా పరిష్కరించి, కోర్టు ఆదేశాలను అమలు చేశారు.సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో సర్వే నంబర్ 548/37 /5/4లో ఉన్న భూమిపై చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత రెవెన్యూ, పోలీస్, సర్వే శాఖల అధికారులు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. భూమిని పరిశీలించి, సర్వే నిర్వహించి హద్దులను గుర్తించారు. అధికారుల సమక్షంలో 3 ఎకరాల భూమిని గిరిజన మహిళ బానోతు లక్ష్మికి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను అమలు చేయడమే తమ బాధ్యత అని తెలిపారు. భూమి తమకు దక్కడంతో బానోతు లక్ష్మి కుటుంబ సభ్యులు అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నాళ్లుగా కొనసాగు తున్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామంలో సంతృప్తి వ్యక్తమైంది.



## అన్నారుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సీమంతాల వేడుకలు

**హాజరైన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్**

**తల్లాడ, ఆగస్టు 17 (నినాదం)**

తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఏసీడీపీఓ పద్మ హాజరై ప్రత్యేకంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు అన్నప్రాసన వేడుకను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భద్రమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి, రాంబాయి, అంగన్‌వాడీ టీచర్ కోపేల మీనాకుమారి, ఆయా ఇన్నార్ష, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## ఎల్ నీనో ప్రభావం దృష్ట్యా వర్షాధార పంటలు సాగు చేసుకోవాలి

**ఎంఏఓ ఋష్యేంద్రమణి**

**మిర్యాలగూడ, ఆగస్టు 17(నినాదం ):**

ఎల్ నీనో వర్షాభావం దృష్ట్యా రైతులు వర్షాధార పంటలు సాగు చేసుకోవాలని మిర్యాలగూడ మండల వ్యవసాయాధికారి మేకల ఋష్యేంద్రమణి కోరారు. సోమవారం మిర్యాలగూడ రైతువేదికలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, రైతులకు ప్రత్యామ్నాయ పంటలు వర్షాధార పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల వర్షాధార పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వర్షధార పరిస్థితులకు అనుగుణంగా కంది, పెసర, మినుములు, జొన్నలు, సజ్జ, రాగులు, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేసుకోవాలన్నారు. సమావేశంలో పిసిసి డెలిగేట్ సభ్యుడు తిరుమలి కృష్ణయ్య ఎఇఓ మాలవత్ రమేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, తలకొప్పుల సైదులు, రైతులు జొన్నలగడ్డ మోహన్ రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బోయిన వేణు..

**నేలకొండపల్లి, ఆగస్టు 17 (నినాదం)**

పాలేరు నియోజవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పౌరసరఫాల శాఖ ద్వారా అందిస్తున్న 3నెలల ఉచిత సన్న బియ్యం కార్యక్రమం పొదుపు స్నేహ గ్రూప్ ద్వారా అందిస్తుంది కావున లిగ్రామ సర్పంచ్ బోయిన వేణులి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు... ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొర్లకుంట నాగేశ్వరావు గారు కట్టు కాసారం సర్పంచ్ బాణావతి సైదులు నాలుగో వార్డ్ నెంబర్ లు కాలింగి వీరబాబు లక్క నాగరాజు కోసూరి పానకాలు కోసూరి రాజబాబు బోయిన గురవయ్య బోయిన రేణుకారావు ఇరగ దిండ్ల నాగరాజు. బోయిన నరసింహారావు బోయిన బ్రహ్మం లింగం రామకృష్ణ బోయిన కిట్టయ్య తీగ సైదులు వై కమలాకర్ బోయిన నాగరాణి స్నేహ గ్రూపు సభ్యులు మేకల భద్రమ్మ బోయిన మాణిక్యం బోయిన శ్రీలత మేకల లక్ష్మి మేకల శ్రావణి పందిటి ఉత్తరమ్మ పెట్టూరి సుకన్య అడికొప్పుల లీలావతి దుగ్గి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో విలువైన వృక్షం మాయం

- దీనికి సూత్రధారి ఎవరు? సర్పంచ్ లేక కార్యదర్శి?
- గ్రామపంచాయతీ ఆవరణంలో వృక్షాలకు రక్షణ కరువు




**అన్నపురెడ్డిపల్లి,ఆగస్టు17, నినాదం:**
అన్నపురెడ్డిపల్లి మండల పరిధి లో పెంట్లం గ్రామపంచాయతీ ఆవరణలో గత 50 సంవత్సరాలు క్రితం గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటి సూరయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నిర్మాణం జరిగింది. ఆనాడు పెంట్లం ఫారెస్ట్ నర్సరీ నుండి టేకు మొక్కలు తెప్పించి పంచాయతీ ఆవరణంలో నాటడం జరిగింది. ఉన్న ప్రభుత్వ/పబ్లిక్ ఆస్తి అయిన విలువైన టేకు చెట్టు గత నాలుగు రోజుల క్రితం మాయం. దీనికి సూత్రధారి ఎవరు?సర్పంచ్ లేక పంచాయతీ కార్యదర్శి?. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామాలలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు ఇలాంటి చర్యలకు గోడ్డలి పెట్టుగా మారాయి.. ప్రభుత్వ పంచాయతీ కార్యాలయంలో టేకు వృక్షం మాయంపై ప్రజల్లో పలుమా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాతీ కార్యాలయం లో వృక్షాలకు రక్షణ కరువు. ప్రభుత్వ ఆస్తులను అపహరిస్తే ఫిర్యాదు చేయలి కదా? ఎందుకు అలసత్వం వహిస్తున్నారు?అంటున్న స్థానికులు. అధికారులే తొలగించి అమ్ముకున్నారా?లేక గుర్తుతెలియని వ్యక్తులు దోచుకున్నారా? అనేది తెలియాలి. ప్రభుత్వం గండి కొట్టి దొంగ చాటుగా అమ్ముకున్నారని ఆరోపిస్తున్న ప్రజలు. ఈ విషయంపై ఉన్నత అధికారులు సమగ్రంగా విచారణ జరిపించి ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# కళ్యాణలక్ష్మి ఎత్తివేత కుట్రను సహించం

- సత్తుపల్లి మాజీ సండ్ర వెంకట వీరయ్య
- హైకోర్టు స్టే ఉన్నా.. ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయడం లేదు?
- పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలి.. లేకుంటే బీఆర్ఎస్ పోరుబాట



**కల్లూరు, ఆగస్టు 17 (నినాదం)**
కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసే కుట్రను సహించబోమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. కల్లూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పేదల కష్టాలను చూసిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మానవతా దృక్పథంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని సండ్ర గుర్తుచేశారు. రూ.50 వేలతో ప్రారంభమైన పథకాన్ని అనంతరం రూ.1,00,116కు పెంచి పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాల అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ వారాలు గడుస్తున్నా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం పేదల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సండ్ర మండిపడ్డారు. ప్రభుత్వ అలసత్వంతో పేద, మైనార్టీ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని, పేద కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు సండ్ర తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, మేకల కృష్ణ, మల్లేశ్వరరావు, కొరకప్పు ప్రసాద్, పి. రామకృష్ణ, కిరణ్ ఇస్మాయిల్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులుపాల్గొన్నారు

# తీజ్ పండుగను ఘనంగా నిర్వహించాలి

### మూడు చెక్కలపల్లి సర్పంచ్ సపావట్ కవిత దేవునాయక్



**నల్లబెల్లి, ఆగస్టు 17 (నినాదం):**
నల్లబెల్లి మండలం లో మూడు చెక్కలపల్లి గ్రామంలో బంజారా ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా ఘనంగానిర్వహించుకోవాలని మూడు చెక్కలపల్లి గ్రామ సర్పంచ్ సపావట్ కవిత దేవునాయక్‌పిలుపునిచ్చారు. తీజ్ పండుగ తొమ్మిదో రోజు ముగింపు కార్యక్రమానికి బంజారా ప్రజలు సిద్ధం కావాలని ఆమె సూచించారు. సంప్రదాయం ప్రకారం గోధుమలనునానబెట్టుకుని, తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం చివరి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలను సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించుకోవడం బంజారా సంస్కృతిలో ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంలోసుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించే తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని అన్నారు. పండుగ విశిష్టతను యువత తెలుసుకోవడంతో పాటు తమ ఆచార సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. తీజ్ పండుగను ప్రతి బంజారా కుటుంబంఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ముగింపు కార్యక్రమంలో మహిళలు, యువత, పెద్దలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని సర్పంచ్ సపావట్ కవిత దేవునాయక్ కోరారు.




## కళ్యాణలక్ష్మీ షాది ముభారక్ పథకాలు యధావిధిగా కొనసాగించాలి

**కమలాపూర్ ,ఆగస్టు 17 (నినాదం)**
పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు యధావిధిగా కొనసాగించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మీ, షాద్ ముబారక్ పథకాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పిలుపు మేరకు, సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా చేసి నిరసన తెలిపారు. అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయ కులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఈ పథకాల అమలుపై నిర్లక్ష్యం చూపుతూ పేదల ఆశలను వమ్ము చేస్తోందని ఆరోపించారు. పేదింటి ఆడబిడ్డల సంక్షేమంతో ఆటలాడటం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి అని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, ప్రభు త్వం వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు బకాయి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తక్కళ్ళపల్లి సత్యనారాయణ రావు, పేరాల సంపత్ రావు,ఎర్రం ఇంద్రసేనా రెడ్డి, మారేపల్లి నవీన్ కుమార్ ,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ కౌడగాని రాజేష్ ,మౌటం అశోక్ , పాక రవిందర్ ,మామిడి శెట్టి శేఖర్,పోడేటి శేఖర్, మాట్ల రాజు, రాజేష్, రాజ్ కుమార్,సమవుట్ సంపత్ రావు, రామచందర్,పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 44 ఫిర్యాదుల స్వీకరణ

**కమలాపూర్, ఆగస్టు 17 (నినాదం)**
రాష్ట్ర ప్రభుత్వ ఆణఆదేశాల మేరకు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజా వాణి కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోసం మండల అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. రెవెన్యూ శాఖకు సంబం ధించిన 8, పంచాయతీ రాజ్ శాఖ11, విద్యుత్ శాఖ 2, హౌసింగ్ 23, మొత్తం 44 ఫిర్యాదులు వచ్చినట్లు స్థానిక ఎంపీడీఓ జి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, పంచాయతీ అధికారి చేతన్ రెడ్డి, మండల సహాయ కార్యక్రమ అధికారి రమేష్, పలు శాఖల అధికారులు,పలు గ్రామాలకు ప్రజలు పాల్గొన్నారు.



## తల్లాడ కాంగ్రెస్ గ్రామ కమిటీల నిర్మాణంపై కసరత్తు

**అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి**
**పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి**
**సంస్థాగత నిర్మాణ పరిశీలకులుగా ముదుముంతల గంగరాజు, పమ్మి అశోక్**

**సత్తుపల్లి ఆగస్టు 17 (నినాదం)**
తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల సంస్థాగత నిర్మాణంపై సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహిం చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సూచనల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. తల్లాడ మండల గ్రామ పార్టీ కమిటీల సంస్థాగత నిర్మాణ కార్యక్రమ పరిశీలకులుగా జిల్లా సెక్రటరీ, అధికార ప్రతినిధి ముదుముంతల గంగరాజు, పమ్మి అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన మార్గదర్శ కాల ప్రకారం మండల గ్రామ పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీల్లో మహిళలు, యువతతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి సంస్థాగత నిర్మాణం కీలక మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగు నూరి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ఎర్రి నరసింహారావు, సొసైటీ డైరెక్టర్ కుర్నవల్లి పోతురాజు కోటయ్య, విజయ్ కొత్తపల్లి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలి

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి



**వేములపల్లి, ఆగస్టు 17(నినాదం):**
పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వేములపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ఇంటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసానిచ్చే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించి అయినా ఈ పథకాన్ని కొనసాగించి పేదలను ఆదుకోవాలని కోరారు. అలాగే రైతాంగం కోసం అమలు చేసిన రైతుబంధు, రైతుభీమా పథకాలను నిలిపివేయకుండా పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులకు ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని, సాగర్ ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పుట్టల సందీప్‌కుమార్, పెద్దపంగ సైదులు, చందనబోయిన చంద్రయ్య, మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, శ్రీరామ్‌రెడ్డి, కట్టా మల్లేష్‌గౌడ్, వేరాల గురువారావు, ఉగ్గే మునీశ్వర్, గడ్డం వెంకన్న, గొర్ల శ్రీనివాస్, పోల్ లింగయ్య, శంకర్, జావిద్, వెంకన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## నేలకొండపల్లి ఎంపీడీఓ ఎర్రయ్యకు సన్మానం

**నేలకొండపల్లి ఆగస్టు 17( నినాదం )**
నేలకొండపల్లి ఎంపీడీఓ ఎర్రయ్య కు ఉత్తమ ఎంపీడీఓ గా అవార్డు రావడం తో ఆయన్ను శాలువా తో ఘనంగా సన్మానించారు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు.వరుసగా రెండోసారి ఉత్తమ ఎంపీడీఓ అవార్డు రావడానికి కారణం నేలకొండపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో ముందుంచడమే కారణం అని ఆయన అన్నారు.మండలం లో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఒక అధికారిగా కాకుండా కుటుంబ సభ్యుడిలా ఉంటారని ఆయన తెలిపారు.ఈ,కార్యక్రమంలో సుల్తాన్ వీరబాబు,కొండమీద వెంకన్న,సోమన బోయిన నవీన్, కడియాల నరేష్, షేక్ లాల్ పాషా,గడిపల్లి నవీన్,బచ్చలకూరి వీరబాబు,బచ్చలకూరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి, ఎమ్మెల్యే చెప్పిన సమస్య

# పరిష్కరించడం లేదు

- నా సమస్యను అడ్డుపెట్టుకొని డేనియల్ వ్యాపారం చేస్తున్నారంటున్నా బాధి తుడు
- 8 ఏళ్లుగా రోడ్డు సమస్యను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటున్న తల్లికొడుకులు



**ఇల్లందు అగస్ట్ 17:(నినాదం ):**
గడిచిన 8 ఏళ్లుగా మా వీధిలో ఉన్న రోడ్డు సమస్యలను పరిష్కరించకుండా అధికారులు పాలక ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని బాధితులు తల్లి కొడుకులైన బండి వెంకటమ్మ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఇల్లందు ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఎనిమిదేళ్లుగా పడుతున్న ఆవేదనను వెలిబుచ్చారు. తము లూయిస్ వసంత్ కుమార్ అనే వ్యక్తి చెందిన భూమిని కొనుగోలు చేసి 40 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నామని భూమి కొనుగోలు చేసే సమయంలో మా ఇంటికి తూర్పు భాగాన 15 ఫీట్ల రోడ్డు వదిలేసి ఇతరులందరికీ భూమిని అమ్మారన్నారు. ఇది రాను రాను కబ్జా గురై రోడ్డు నిర్మాణానికి వీలు లేకుండా చేస్తున్న అంశం పైన గడిచిన 8 ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని తెలిపారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రులు ఎమ్మెల్యేలు సైతం వినతి పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు సరైన సమాచారం వారికి ఇవ్వకపోవడంతో సమస్య అలాగే ఉందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించమని స్థానిక ఎమ్మెల్యే కోరం కనుక సూచించారు అన్నారు. మంత్రి సూచనల మేరకు తాను ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించగా ఆ భూమికి సంబంధించిన వారి వివరాలు తెలుసుకొని మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డేనియల్ సమస్య పరిష్కరించాలని తెలిపారు అన్నారు. ఈ భూమి డానియల్ మామగారైన లూయిస్ వసంత్ కుమార్ దని. అయితే అప్పుడు ఈ భూమిని వారి కుమారులకు తెలియకుండా వసంత్ కుమార్ తల్లి అందరికీ నోటిమాటన తెల్ల పేపర్ మీద అమ్మినట్లు ఇచ్చారని, వాటిపైన వారసులే గాని అమ్మిన వారి గాని సంతకాలు లేవని బెదిరింపులకు దిగుతున్నారన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించమని మంత్రి ఎమ్మెల్యే తెలిపితే చివరికి తాము నివసించే ఇల్లే కబ్జా రంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీనికి తోడు మాపై అనేక తప్పుడు ఆరోపణలు తప్పుడు కేసులు ఫిర్యాదులు చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇక్కడ రోడ్డు సమస్యను పరిష్కరిస్తే ఇటీవల డానియల్ ప్రారంభించిన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులంతా తిరుగుబాటు చేస్తారని ఉద్దేశంతో నా సమస్యను అడ్డుపెట్టుకొని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేద వ్యక్తం చేశారు. ఈ భూమి అమ్మిన వ్యక్తిని ఇతర ప్రాంతాలను పంపించారని ఆయనను పిలిపిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అధికారుల దిశగా ప్రయత్నించి మా సమస్యను పరిష్కరించి వరద ముంపు గురికాకుండా మాకు ఉన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



## సిపిఐ(ఎం) సీనియర్ నాయకురాలు దేవబత్తిని పుల్లమ్మ మృతి

### నివాళులు అర్పించిన నున్నా నాగేశ్వరరావు



**వైరా, ఆగస్టు 17( నినాదం):**
వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డుకు చెందిన సిపిఐ(ఎం) పార్టీ సీనియర్ సభ్యులు, అమరజీవి దేవబత్తిని భూషయ్య సతీమణి సీనియర్ నాయకురాలు దేవ బత్తిని పుల్లమ్మ ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. సోమ వారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మెరుగు రమణ, దేవబత్తిని పుల్లమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెంపాటి వీరభద్రరావు, చెరుకుమల్లి కుటుంబరావు, మచ్చా మణి, తూము సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, బాజోజు రమణ, మల్లెంపాటి రామారావు, మల్లెంపాటి ప్రసాద రావు షేక్ నాగుల్ పాషా, యనమద్ది రామకృష్ణ, కంసాని మల్లీకాంబ, భూక్యా విజయ, మాడపాటి వెంకటేశ్వరరావు, మాడపాటి మల్లికార్జునరావు, వేల్పుల మైఖేల్, కొంగర నాగేశ్వరరావు, చిట్టోజు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు చెరుకూరి చలపతిరావు, కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజా, మిట్టపల్లి నాగి, సూతకాని జైపాల్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహం లభ్యం

**అశ్వాపురం, ఆగస్టు 17 (నినాదం):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం గొందిగూడెం ఇసుకవాగు సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని పాకాలపాటి సాయి (30)గా గుర్తించారు.. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, సాయి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..



## సోమారంలో ఘనంగా

## ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు

**తొర్రూరు, ఆగస్టు 17(నినాదం):**
తొర్రూరు మండలం సోమారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వారు జన్మదినం రేపు ఉండడంతో ముందస్తుగా ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఝాన్సీ రాజేందర్ రెడ్డి కి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొని ఝాన్సీ రాజేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణితో సమస్యలకు తక్షణ పరిష్కారం

### మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రావు

**వేములపల్లి, ఆగస్టు 17(నినాదం):**
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వేములపల్లి మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం వేములపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి వేదికగా పలువురు బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి వేదికను వినియోగించుకోవాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖకు సంబంధించి ఒకటి, మండల పరిషత్‌కు ఒకటి, ఇతర అంశానికి సంబంధించి మరొక దరఖాస్తు చొప్పున మొత్తం 3 అర్జీలు వచ్చినట్లు వివరించారు. స్వీకరించిన ప్రతీ దరఖాస్తును సంబంధిత విభాగ అధికారులకు పంపి, బాధితులకు వేగంగా పరిష్కారం లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి తాసిల్దార్ హేమలత, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో జ్యోతి, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ఎంపీఓ లలిత, ఏవో కిషోర్ నాయక్, ఏఈలు నాగరాజు, భవాని, పశువైద్యాధికారి అశోక్, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం జానకి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మనిషి బతికుండగానే 'లేట్'..

- తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో వింత తప్పిదం
- మంత్రి ఆదేశించినా పరిష్కారం కాని ఇందిరమ్మ ఇంటి బిల్లు
- రికార్డులో భర్తను 'మరణించిన వ్యక్తి'గా నమోదు చేశారంటూ మాజీ సర్పంచ్ ఆవేదన

**తల్లాడ, ఆగస్టు 17 (నినాదం):**
ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణలో జరిగే చిన్నపాటి పొరపాట్లు ప్రజలకు పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో ఓ వ్యక్తి బతికుండగానే రికార్డుల్లో 'లేట్'గా నమోదు చేసిన ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తప్పిదం కారణంగా ఇంది రమ్మ ఇంటి చివరి విడత బిల్లు మంజూరు కాకపోవ డంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతు న్నామని కేశవాపురం గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పెర కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పెర కుమారి కుటుంబం గత 40 సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిలోనే నివాసం ఉంటోందని ఆమె తెలిపారు. అయితే ఆ భూమిపై కొంతమంది తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో వివాదం ఏర్పడిందని పేర్కొ న్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకు న్నప్పటికీ, చివరి విడత బిల్లు పెండింగ్‌లో ఉండిపోయిందని ఆమె తెలిపారు.

**ప్రజాదర్బార్‌లో మంత్రికి వినతి**

ఇందిరమ్మ ఇంటి బిల్లు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల కల్లూరులో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఉప్పెర కుమారి వినతిపత్రం సమర్పించారు. తాను సుమారు 40 ఏళ్లుగా అదే భూమిలో నివసిస్తున్నందున ఇందిరమ్మ ఇంటి బిల్లును నిలిపివేయకుండా నిబంధనల ప్రకారం పరిశీలించి మంజూరు చేయాలని ఆమె కోరారు. వినతిని పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించినప్పటికీ, ఇప్పటికీ బిల్లు మంజూరు కాలేదని ఉప్పెర కుమారి వాపోయారు.

**బతికుండగానే 'లేట్' ఎలా?**

ఇదిలా ఉండగా, తన భర్త నాతనీ బతికుండగానే తహసీల్దార్ కార్యాలయ రికార్డుల్లో ఆయన పేరు పక్కన 'లేట్' అని నమోదు చేశారని ఉప్పెర కుమారి ఆరోపించారు. ఈ తప్పిదం కారణంగానే తాను మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌ను నినాదం రిపోర్టర్ వివరణ కోరగా, పొరపాటున భర్త పేరు వద్ద 'లేట్' అని నమోదైందని, అనంతరం దానిని సరిచేసి కలెక్టర్ కార్యాలయానికి పంపించామని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.

**25 రోజులు గడిచినా పరిష్కారం ఏది?**

కల్లూరులో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగి సుమారు 25 రోజులు గడుస్తున్నప్పటికీ తన సమస్య పరిష్కారం కాలేదని ఉప్పెర కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి, జిల్లా కలెక్టర్ సమక్షంలో సమస్యను ప్రస్తావించినా తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం తన పని ముందుకు సాగడం లేదని ఆమె ఆరోపించారు. "ప్రజాదర్బార్‌లో ఉన్నతాధికారులకు సమస్యను చెప్పినా ప్రయోజనం లేకపోతే, సామాన్య ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? రోజూ కార్యాలయాల చుట్టూ తిరగడమేనా?" అని ఆమె ప్రశ్నించారు. ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలను స్వయంగా విని అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు ఆలస్యం కావడంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను కింది స్థాయి అధికారులు సకాలంలో అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## 10 అర్జీల స్వీకరణ

**కాటారం, ఆగస్టు 17( నినాదం):**
కాటారం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అధికారులకు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 10 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, నోడల్ అధికారి, అడ్డూరి బాబు, తాసిల్దార్ నాగరాజు, వ్యవసాయ శాఖ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి దళితుల సమస్యలు తీసుకెళ్లాలి

### జేఏసీ చైర్మన్ పీక కిరణ్ విజ్ఞప్తి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 17 (నినాదం):**
ఈ నెల 19న భూపాలపల్లి జిల్లాకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణికుంట్ల ప్రవీణ్ రానున్న నేపథ్యంలో జిల్లాలోని దళితులు, దళిత సంఘాల నాయకులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని జేఏసీ చైర్మన్ పీక కిరణ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో కమిషన్ చైర్మన్, సభ్యులతో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలతో పాటు జిల్లాలో దళితులపై జరుగుతున్న కుల వివక్ష, అంటరానితనం, వివక్షత ఘటనలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఆధిపత్య కులాల పెత్తనం, దళిత వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ



అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం, ఉదాసీనత వంటి అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించాలని పీక కిరణ్ కోరారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను కమిషన్ చైర్మన్, సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల జిల్లా కన్వీనర్ అజ్మీర పూల్ సింగ్, జిల్లా కో-కన్వీనర్ రామగిరి రాజు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ
- హుజూర్‌నగర్‌లో విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం



**హుజూర్‌నగర్, ఆగస్టు 17 (నినాదం):**
హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ చలిగంటి నరేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చలిగంటి నరేష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్, పిన్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరి తోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. గుర్తుతెలి యని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు సమా చారం అందించాలని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల హెడ్‌మాస్టర్ మహబూబ్ జాని, కానిస్టేబు ళ్లు జానిమియా, మహేష్, మహిళా కానిస్టేబుల్ అనూష, హోంగార్డు కాశయ్య, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, సత్యం, చారి, కృష్ణ, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార మార్గమే ప్రజావాణి

**ములకలపల్లి, ఆగస్ట్ 17 (నినాదం ):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండల ఎంపీడీవో ప్రజావాణి ప్రజా సమస్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఆధ్వర్యంలోజరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు వారి సమస్యలను అధికారులకు వివరించడం జరిగింది. ప్రజల నుండి వినతి పత్రాలు అందుకున్నటువంటి అధికారులు ప్రజల సమస్యలకు త్వరలోనే పరిష్కారశీ లభిస్తుందని వినతి పత్రాలు అందజేసినటువంటి ప్రజలకు తెలియజేయడం జరిగింది. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ప్రజావాణికి హాజరైనటువంటి అధికారులు ఒకరిద్దరు తప్ప, మిగతా అధికారులు ప్రజల సమస్యలు వినడానికి బదులుగా చరవాణి లలో నిమగ్నమయ్యారు. అధికారుల తీరుకు సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలు విస్తు పోయారు.

## నాడు మంత్రి ఇచ్చారు.. నేడు కబ్జాదారులు నొక్కేశారు!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మందలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 586/1లో ఐదు ఎకరాల భూమిని సదరు కుటుంబానికి కేటాయించారు. నాటి నుంచి ఆ భూమిని నమ్ముకునే ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది. అయితే, గత కొంతకాలంగా క్షేత్రస్థాయిలో తమకు కేటాయించిన భూమి లెక్కల్లో తేడాలు రావడంతో బాధితురాలు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం తమ స్వాధీనంలో కేవలం నాలుగు ఎకరాల భూమి మాత్రమే ఉందని, మిగిలిన ఒక ఎకరం భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించారని ఆమె ఆరోపిస్తున్నారు. గత 30 ఏళ్లుగా ఈ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం, స్థానికంగా ఉన్న కొందరు పెత్తందార్లు ఆ భూమిని అనుభవిస్తుండటంతో పోలమ్మ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

**అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం. ప్రజావాణిలో విన్నపం!**

స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సరైన స్పందన కరువవడంతో, విసిగిపోయిన బాధితురాలు దమ్మపేటలో నిర్వహించిన ప్రజావాణి వేదికను ఆశ్రయించారు. ప్రభుత్వం తనకు కేటాయించిన ఐదు ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి, ఆక్రమణదారుల నుంచి ఒక ఎకరం భూమిని స్వాధీనం చేసుకుని తనకు అప్పగించాలని ఆమె అధికారులను వేడుకున్నారు. ప్రజావాణిలో వినతిపత్రం స్వీకరించిన రెవెన్యూ ఉన్నతాధికారులు.. ఈ సమస్యపై తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని స్థానిక రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు.




## ఖమ్మం జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా డాక్టర్ కాపా మురళీకృష్ణ

**వైరా,ఆగస్టు 16 (నినాదం ):**
ఖమ్మం జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 2026-2030 సంవత్సరాలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక వైరా మున్సిపల్ కమిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ స్టేట్ సెపక్‌తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వై.బుచ్చి రామారావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా డాక్టర్ కాపామురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా వుండ్రు శ్యాంబాబు, శీలం శ్రీవిద్య,పి. రమణ, తోటకూర శ్రీకాంత్, అసోసియేట్ ఉపాధ్యక్షులుగా డాక్టర్ నెహాల్, అరుణపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శిగా డా. పులి మధు, కోశాధికారిగా పి.సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జంగాల కోటేశ్వరరావు జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పి.రఘువరన్, పేరిపల్లి శ్రీను, కే.శివకృష్ణ, రోజా,అడ్వైజర్లుగా పువ్వాళ్ళ రాము, బీక్యా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్.అనూష, బి.ఆమని,వి. త్రినాథ్ బి.పవన్, జే గోపాలకృష్ణ సీ.సురేందర్, రాహుల్, 2026--2030 నూతన కార్యవర్గ ఎన్నికల కార్యక్రమం తెలంగాణ స్టేట్ అబ్జర్వర్‌గా కే. భాస్కర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్‌గా క్రిస్టోఫర్ బాబు వ్యవహరించారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సెపక్‌తక్రా క్రీడాకారులు, క్రీడాభిమానులు, నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో సెపక్‌తక్రా క్రీడ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

## మాతాశిశు హాస్పిటల్ సౌకర్యాల

# కల్పనలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

- డాక్టర్లు లేక గర్భిణి స్త్రీలకు అందని వైద్యం
- స్కానింగ్ కొరకు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లే దిక్కు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్
- సిపిఎం సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి



**చుంచుపల్లి,ఆగస్టు 17(నినాదం)**

మాత శిశు హాస్పిటల్ లో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ విమర్శించారు.సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో రామవరం లోని మాతా శిశు హాస్పిటల్ సమస్యలపై సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఎజె రమేష్ మాట్లాడుతూ హాస్పిటల్లో రోజుకు ఐదు వందల మంది గర్భిణి స్త్రీలు,పిల్లలు వస్తున్నారని కేవలం నలుగురు డాక్టర్లు మాత్రమే ఉన్నారని అన్నారు. హాస్పిటల్ లో స్కానింగ్ రూమ్ సౌకర్యాలు ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేకపోవడం వలన డాక్టర్లే ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లకు పేరు చెప్పి మరి సలహాలు ఇస్తున్నారని ఆరోపించారు. తాగడానికి మంచినీళ్ళ కూడా లేవని,బాత్రూంలు,మరుగుదొడ్లు శుభ్రంగా లేవని చిన్న పిల్లల వార్డుల్లో బాత్రూమ్ లు లేక మరుగు దొడ్లలో లేదా ఇంటికి వెళ్ళి స్నానాలు చేసి వస్తున్నారని అన్నారు.మూడు సంవత్సరాల క్రితం స్వచ భారత్ లో భాగంగా నిర్మించిన మూత్రశాలలు నేటికి ప్రారంభానికి నోచుకోలేదని అవి ఇపుడు నిరుపయోగంగా ఉన్నాయని,పార్క్ నిర్వహణ సరిగ్గా లేక అడవిని తలపిస్తుందని ఆరోపించారు. ఈ రెండింటి బాధ్యత కార్పొరేషన్ అధికారులది అయినప్పటికీ వారు కూడా పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.గర్భసంచి ఆపరేషన్ కొరకు వచ్చిన మహిళలను రకరకాల కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారని దీనికి కారణం ఏంటని డాక్టర్లను ప్రశ్నించగా ఇథనాల్ సప్లై లేక చేయడం లేదని చెప్పారు. సిరంజిల సప్లై,చిన్న పిల్లలకు నిమ్ము వచ్చినపుడు ఆవిరి పట్టడానికి వేసే మందు కూడా బయట ప్రైవేట్ షాపు నుండి తెచ్చుకుంటున్నారని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. హాస్పిటల్ పరిసర ప్రాంతాలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయని,కోతులు,కుక్కల బెడద ఉందని తెలిపారు. హాస్పిటల్ లో సరైన పర్యవేక్షణ లేకపోవడం వలన మందు బాబులకు అడ్డాగా మారిందని తెలిపారు.ప్రభుత్వం స్పందించి పై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో ప్రజలను కలుపుకొని ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భుక్య రమేష్ నాయకులు కోట బాలక్రిష్ణ రాములు రఘు రుహీనా పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

సింగరేణి సెక్యూరిటీ గార్డు కోట శేఖర్ రహదారి సమీపంలో ప్యాంగోలిన్‌ను గుర్తించారు. దాని ప్రత్యేక రూపాన్ని గుర్తించిన వారు వెంటనే అప్రమత్తమై, అక్కడి స్థానిక యువకుల సహకారంతో ప్యాంగోలిన్‌కు ఎలాంటి హాని కలగకుండా సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని కొత్తగూడెం 1 టౌన్ సీఐ కరుణాకర్ కి సమాచారం అందించగా, పోలీస్ శాఖ--అటవీ శాఖల మధ్య సమన్వయం ఏర్పడింది. అటవీ శాఖకు చెందిన కొత్తగూడెం డివైఆర్ఓ రాము, ఎఫ్బిఓ లు బాబురావు, నరేష్ లు సంఘటనా స్థలానికి చేరుకుని ప్యాంగోలిన్‌ను స్వీకరించారు.

**కిన్నెరసాని ప్రాంతంలో సురక్షిత పునరావాసం....**

కొత్తగూడెం సింగరేణి మెయిన్ హాస్పిటల్ సమీపంలో రాత్రి సమయంలో గుర్తించి రక్షించిన అరుదైన ఇండియన్ ప్యాంగోలిన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ సిబ్బంది సురక్షితంగా కిన్నెరసాని ప్రాంతానికి తరలించారు. ప్యాంగోలిన్‌ను సంబంధిత అటవీ అధికారులు పరిశీలించిన అనంతరం, దాని సహజ జీవన విధానానికి అనుకూలమైన అటవీ ఆవాసంలోకి తిరిగి చేర్చే చర్యల్లో భాగంగా కిన్నెరసాని డీర్ పార్క్ పరిధిలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడుదల చేశారు. ఈ విడుదల కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాము, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరేష్, సంబంధిత కిన్నెరసాని డీర్ పార్క్ సెక్షన్ ఆఫీసర్ పాల్గొని ప్యాంగోలిన్‌ను ఎటువంటి ఇబ్బంది కలగకుండా సహజ ఆవాసంలోకి వదిలారు.



## గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు 'ఉద్దీపకం-3' దిక్సూచి

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 17 (నినాదం):**

లక్ష్మీదేవిపల్లి మండలంలోని టీడబ్ల్యూ యూపీఎస్ పృథ్వీరాజ్ నగర్ (ఎదురుగడ్డ) పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి. అనసూయ అధ్యక్షతన 'ఉద్దీపకం-3 పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎదురుగడ్డ గ్రామ సర్పంచ్ భట్టు అరుణ్, ఉప సర్పంచ్ భుక్యా జయ ముఖ్య అతిథులుగా పాల్గొని తమ చేతుల మీదుగా 'ఉద్దీపకం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఏఎంసీ డైరెక్టర్ తేజావత్ శివ హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, జయదేవ్, సురేష్, నాగేంద్రమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 'ఉద్దీపకం' వంటి పుస్తకాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి జ్ఞానాన్ని



విస్తరించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందుకు ఎంతగానో దోహదపడతాయని అతను పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన విద్యా వనరులు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.




## విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 17 (నినాదం):

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈ జాక్ కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్పిడిసిఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం 12 గంటలకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 19న హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 2026 వేతన సవరణ అమలు చేయాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబి నిబంధనలు వర్తింపజేయాలని, ఈపిఎఫ్ నుంచి జిపిఎఫ్ కు అవకాశం కల్పించాలని, వైటీపిఎస్ బొగ్గు, యాష్ ప్లాంట్ల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, అన్ని కేడర్లలో ప్రమోషన్లు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.



## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**వలిగొండ, ఆగస్టు 17 (నినాదం):**

మండల స్థాయి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నూతనంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 21 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, 16 మంది బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఎంఈఓ భాస్కర్, వైద్యాధికారి జ్యోతి, ఏఈ సందీప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలి

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి

**నల్లబెల్లి,ఆగస్టు 17(నినాదం):**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నల్లబెల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవం, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.కొనసాగించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన రాస్తారోకో సుమారు మూడు గంటలపాటుకొనసాగడంతో కొంతసేపు ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. రాస్తారోకో విరమించాలని ఎస్సై సాయి ప్రసన్నకుమార్ కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ ముప్పు కృష్ణ అక్కడికి చేరుకుని బీఆర్ఎస్ నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో నాయకులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పాక్స్ మాజీ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, మాజీ ఎంపీపీలు కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, ఊడుగుల సునీత, మాజీ జడ్పీటీసీ బానోతు హరినాథ్‌సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గందె శ్రీనివాస్‌గుప్తా, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పులి రమేష్, ప్రధాన కార్యదర్శి జాటోతు రవి చిన్న, గౌరవ అధ్యక్షుడు మచ్చిక రవి, బీఆర్ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గోనె శ్రీదేవితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.అనితావనికి ఘన వీడ్కోలు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 17 (నినాదం):**

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ కోర్టుకు బదిలీ అయిన జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.అనితావనికి జిల్లా కోర్టు ప్రాంగణంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఎక్కడికి బదిలీ అయినా ఆయురారోగ్యాలతో, విధుల పట్ల నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అనితావని అందించిన సేవలను అభినందిస్తూ, కొత్త ప్రదేశంలోనూ మరింత మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందారపు శివకుమార్, న్యాయవాదులు వెంకటస్వామి, అబ్దుల్ కలాం, సూపరింటెండెంట్లు రఘురాం, సదానందం, సీనియర్ అసిస్టెంట్ జి.సురేందర్‌తో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.